
శ్రీ యంత్రోద్ధారక హనుమత్ స్తోత్రమ్

--- భావార్థముతో ---



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ యంత్రోద్ధారక హనుమత్ దేవాలయం - హంపి, కర్నాటక



శ్రీ వ్యాసరాజ తీర్థులు తుంగభద్ర నది ఒడ్డున ప్రతిరోజూ ధ్యానం చేసేవారు. ఒక రోజు వారు ధ్యానంలో హనుమంతుని చిత్రాన్ని దర్శించారు. ఇది ఆ నిర్ధిష్ఠ ప్రదేశంలో మాత్రమే జరిగేది. కాబట్టి తరువాతి సారి ఆయన హనుమ యొక్క చిత్రాన్ని అచట గల ఒక బండపై గీసారు. ఆశ్యర్యంగా ఒక కోతి శిలనుండి సజీవంగా దూకటం, వెంటనే గీసిన చిత్రం అదృశ్యం కావటం జరిగింది. ఇలా ఆయన హనుమ చిత్రాన్ని గీయటం, గీసిన ప్రతిసారి ఒక కోతి సజీవంగా శిలనుండి దూకటం, గీసిన చిత్రం అదృశ్యం కావటం - ఇలా 12 సార్లు జరిగింది. చివరగా ఆ కోతి బయటకు వెళ్ళకుండా ఉండటానికి ఆ చిత్రం చుట్టూ యంత్రాన్ని గీసి హనుమంతుని యంత్రం లోపల బంధించారు. (పై చిత్రం). శ్రీ వ్యాసరాజ తీర్థులు పారవశ్యం చెంది ఈ స్తోత్రం రచించారు. ఆ ప్రదేశంలో (హంపి, కర్నాటక) దేవాలయం నిర్మించబడినది. -×-

శ్రీ యంత్రోద్ధారక (ప్రాణదేవర) హనుమత్ స్తోత్రమ్

01. నమామి దూతం రామస్య సుఖదం చ సురద్రుమమ్।
పీనవృత్త మహాబాహుం సర్వశత్రు నివారణమ్॥
(శ్రీ మారుత్తామసంభూతం విద్యుత్కాంచన సన్నిభమ్)

శ్రీరామునికి ఆనందము నిచ్చిన దూతకు దేవతలపాలిటి కల్పతరువు, పొడుగాటి సున్నిత హస్తములుకలిగి శత్రువులను పారద్రోలే హనుమంతునకు నమస్కారము.

శ్రీరామచంద్రునికి సంతోషప్రదాతయై, దేవతలకు కల్పవృక్షమై, ఆజానుబాహుడై, శత్రువులను పారద్రోలే శ్రీరామదూతకు నమస్కరిస్తున్నాను.

02. నానారత్న సమాయుక్త కుండలాది విరాజితమ్।
సర్వదాభీష్ట దాతారం శతం వై దృఢ మాహవే॥
(ద్వాత్రింశల్లక్షణోపేతం స్వర్ణపీఠవిరాజితమ్)

విలువైన రత్నములతో పొదగబడినటువంటి కుండలములు ధరించినవాడు, యుద్ధరంగంలో స్థిరమైనవాడు, భక్తుల కోర్కెలను సదా తీర్చే శ్రీరామచంద్రుని దూతకు నమస్కారము.

మణులతో కూడిన కర్ణాభరణములను ధరించి, భక్తుల కోరికలను ఈడేరుస్తూ, యుద్ధభూమిలో అరివీరభయంకరుడైన శ్రీరామదూతను స్మరిస్తున్నాను.

03. వాసినం చక్ర తీర్థస్య దక్షిణ్యస్థ గిరౌసదా।
తుంగ(గాం) బోధి తరంగస్య వాతేన పరిశోభితే॥

తుంగానదీ తరంగములపై వీచు గాలులతో మెరిసే పరమపవిత్రమైన చక్రతీర్థము యొక్క దక్షిణ దిశలో వున్న కొండపై వెలసినవాడైన శ్రీరామచంద్రుని దూతకు నమస్కారము.

తుంగానదీ తీరమునుండి వీచే మందమైన, ఆహ్లాదకరమైన గాలులతో చక్రతీర్థమునకు దక్షిణ దిక్కున ఉన్న పర్వతముపై కొలువుండే శ్రీరామదూతకు ప్రణమిల్లుతున్నాను.

04. నానా దేశ గతైః సద్భిః సేవ్యమానం నృపోత్తమైః।
ధూపదీపాది నైవేద్యైః పంచఖాద్యైశ్చ శక్తితః॥

వివిధ దేశాల జనులచే ధూప దీప నైవేద్య సమర్పణలు అందుకొని ప్రసన్నుడైన శ్రీరామచంద్రుని దూతకు నమస్కారము.

వివిధ దేశవాసులచేత, రాజాధిరాజులచేత ఆరాధించబడుతూ, ధూప దీపములతో, అయిదురకములైన నైవేద్యాలతో స్తుతించబడే శ్రీ రామదూతకు నమస్కరిస్తున్నాను.

05. భజామి (శ్రీ)హనుమంతం హేమకాంతి సమప్రభం।
వ్యాసతీర్థ యతీంద్రేణ పూజితం చ విధానతః॥

వ్యాసతీర్థమునులచే పూజింపబడువాడు, సువర్ణమువంటి తేజస్సుతో భాసిల్లు హనుమంతునికి నమస్కారము.

స్వర్ణమయ కాంతితో విష్ణు భగవానునివలే ప్రకాశిస్తూ యతీంద్రులందరికి రాజైన శ్రీ వ్యాసతీర్థులచే ఆరాధించబడిన శ్రీరామదూతకు నమస్కరిస్తున్నాను.

06. త్రివారం యః పఠేన్నిత్యం(స్తోత్రం) భక్త్యా ద్విజోత్తమః।
వాంఛితం లభతేభీష్టం షణ్మాసాభ్యంతరే ఖలు॥

భక్తిశ్రద్ధలతో ఈ స్తోత్రమును ప్రతిరోజు మూడుసార్లు పఠించినట్లయితే ఆరుమాసములలో వారి కోరికలన్నీ సఫలమవుతాయి.

పునః జన్మించిన మంచివారు ఈ స్తోత్రాన్ని ఆరు నెలల వ్యవధిలో వారానికి మూడుసార్లు పఠించినవారికి సకల కోరికలు తీరును.

07. పుత్రార్థీ లభతే పుత్రం యశోర్థీ లభతే యశః।
విద్యార్థీ లభతే విద్యాం ధనార్థీ లభతే ధనమ్॥

ఈ స్తోత్ర పఠనం వలన సంతానార్థులు సంతానమును, కీర్తికాములు యశస్సును, విద్యార్థులు విద్యను, ధనమును వాంఛించేవారు ధనమును తప్పక పొందుతారు.

పుత్రులు కోరువారికి పుత్రులు, యశస్సు కోరినవారికి యశస్సు, జ్ఞానము కోరినవారికి జ్ఞానము, సంపద కోరినవారికి సంపద ప్రాప్తించును.


08. సర్వదామాస్తు సందేహో హరిః సాక్షీ జగత్పతిః।
యః కరోత్యత్ర సందేహం స యాతి నరకం ధృవం॥

హరియే ఈ జగత్తుకు సాక్షియై ఉన్నాడని నమ్మినవారికి స్వర్గప్రాప్తి, అనవసరముగా సందేహించినవారికి నరకలోక ప్రాప్తి లభిస్తాయి.

సాక్షాత్తు హరియే ఈ విశ్వానికి సాక్షీభూతుడన్న పరమ సత్యాన్ని విస్మరించినవారికి నరకము ప్రాప్తించును.

-- ఇతి శ్రీ వ్యాసరాజకృత యంత్రోధ్ధారక హనుమత్ స్తోత్రమ్ సంపూర్ణమ్ --

- = - = -





శ్రీ యంత్రోద్ధారక హనుమత్ దేవాలయం - హంపి, కర్నాటక - చరిత్ర.

వ్యాసరాయుల వారు 732 ఆంజనేయ శక్తులను దక్షిణ భారతదేశం అంతా ప్రతిష్ఠించారు. అందులో మొట్టమొదటి దేవాలయం హంపిలో ఉంది. హంపిలో విరూపాక్ష దేవాలయం బయటకి వచ్చి ఎదురుగా కొండమీది కోదండ రామస్వామి ఆలయం నుంచి ముందుకు వెళితే దూరంగా ఒక గుట్ట మీద అతి శక్తివంతమైన గుహ వుంది. ఆ గుహలో ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. అక్కడ ఉంది ఈ యంత్రం.

ఒక రోజు వ్యాసరాయులవారు స్నానంచేసి వచ్చి అక్కడ రాతి మీద కూర్చుని అక్కడ ఒకచోట ఆంజనేయస్వామి ఆకారం గీసి, ఆంజనేయ ఉపాసన ప్రారంభించారు. ఆంజనేయస్వామి ఆకారం గీయగానే ఆ ఆకారం మాయమై పోయి, అక్కడ ఒక వానరం ప్రత్యక్షమై అక్కడి నుంచి వెళ్లి పోయింది. తరువాత రోజు కూడా అలాగే ఆకారం గీసి ద్యానంలో కూర్చోగానే వానరం వచ్చి మళ్లీ వెళ్లి పోయింది. రోజూ ఇదే తంతు. అలా ఆయన ఆకారం గీయడం. ఉపాసనకు కూర్చోగానే వానరం ప్రత్యక్షమవ్వడం వెళ్లిపోవడం. ఇలా వరుసుగా పన్నెండు రోజులు జరిగిపోయాయి.

ఆయనకు అర్థం కాలేదు. నేను గీస్తున్న ఆకారం నుండి ప్రాణం పోసుకుని వానరం ఎలా బయటకు వస్తోంది అని – ఇక్కడ ఏదో శక్తి వుండి వుంటుంది అని భావించి ద్యానంలో తపస్సమాధిలోకి వెళ్ళి చూడగా ఆయనకు ఒక అద్భుత విషయం తెలిసింది. ఆ హంపిలోనే రాములవారు ఆంజనేయస్వామిని మొట్టమొదట కలుసుకున్నది అని. అప్పుడు ఆయన ఒక యంత్రాన్ని గీసి యంత్రం మధ్యలో ఆంజనేయస్వామి రూపం గీసి అంతకుముందు వెళ్లిపోయిన పన్నెండు వానరాలను ఆ చుట్టు గీసి అక్కడ కొన్ని బీజాక్షరాలను వ్రాసి అప్పటికప్పుడు మంత్రసమానమైన శ్లోకాలను చెప్పారు. అప్పుడు ఆయన మనో నేత్రానికి ఆంజనేయస్వామి దర్శనమై వ్యాసరాయ ఇకనుండి ఎవరైనా ఈ యంత్రాన్ని పూజిస్తూ ఈ మంత్రాన్ని చదివితే వాళ్ళకి నేను కట్టుబడి వుంటాను అని వరమిస్తారు.

ఇక్కడ యంత్రం మద్యలో యోగముద్రలో వున్న స్వామి దర్శనమిస్తారు. అలాగే యంత్రం చుట్టు గ్రంధి స్థలాలలో ఇంతకుముందు వెళ్లిపోయిన 12 వానరాలు వుంటాయి.

– – – = = = – – –

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)

Kiron Type Institute